క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలిఅర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం 2024 సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు ఆవిష్కరించారు. క్లబ్ కార్యాలయంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో కోశాధికారి కేఎల్. జగదీశ్వరాంబ, సభ్యులు పూర్ణచంద్, మురళీకృష్ణ, డాక్టర్ డి.రవీంద్రనాథ్, ఎస్. వెంకటేశ్వరరావు, డాక్టర్ డి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

నెహ్రూ నికేతన్‌లో రైతు దినోత్సవం



తెనాలిఅర్బన్: జాతీయ రైతు దినోత్సవాన్ని బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శనివారం నిర్వహించారు. పాఠశాలలో రైతు చిత్రాలను రూపొందించారు. రైతులు పడే కష్టం ప్రతిబింబించేలా ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, వ్యవస్థాపకులు దాసరి రంగలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి సర్వేను జాగ్రత్తగా నిర్వహించండి



తెనాలిఅర్బన్: కుష్టు వ్యాధి సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు డాక్టర్ బి.మౌనిక, డాక్టర్ వి.మహిత సూచించారు. గంగానమ్మపేట, సుల్తానాబాద్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం కుష్టు వ్యాధి సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరికైనా స్పర్శలేని ఎర్రని రాగివర్ణం గల మచ్చలు ఉంటే.. వారి పేర్లు నమోదు చేయాలని చెప్పారు. అలాంటి వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు ఇస్తుందని చెప్పారు. ఈ నెల 27 నుంచి జనవరి 12 వరకు సర్వే జరుగుతుందని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర పంటలతో అత్యధిక లాభాలు



ఫిరంగిపురం: అంతర పంటలు వేయడం ద్వారా అత్యధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయశాఖ డీపీఎం రాజకుమారి అన్నారు. మండలంలోని 113 తాళ్లూరు, తక్కెళ్లపాడు గ్రామాల్లోని మిరప పంటను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ద్రవ జీవామృతం తయారు చేసుకునే విధానం దానిని ఏవిధంగా ఉపయోగించాలో రైతులకు వివరించారు. మిరప పంటలో అంతర పంటలుగా ముల్లంగి, కొత్తిమీర, ఉల్లి పంటలు వేయాలని సూచించారు. లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయడం ద్వారా పచ్చపురుగును నివారించవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది వరలక్ష్మి, వరప్రసాద్, రామకృష్ణ, అన్నమణి, లిఖిత పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పేరుకలపూడిలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. టీబీ తెనాలి యూనిట్ సూపర్‌వైజర్ పి.రవికుమార్ మాట్లాడుతూ క్షయవ్యాధి అంటువ్యాధి అని, ఇది ఒకరి నుంచి మరొకరికి గాలిద్వారా వ్యాప్తి చెందుతుందని అన్నారు. రెండు వారాలకు పైబడి దగ్గు, జ్వరం, దగ్గినప్పుడు కళ్లె రక్తపు చారలు, బరువు తగ్గిపోవడం, ఆకలి మందగించడం, ఈ లక్షణాలలో ఏ ఒక్కటి ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మందులు వాడాలని సూచించారు. పీహెచ్ఎం వందనా దేవి మాట్లాడుతూ త్వరలో క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పెద్దవారికి బి.సి.జి. వ్యాక్సిన్ అందుబాటులో రానున్నదని తెలిపారు. సర్పంచి గంపల గంగాధర్, ఎంఎల్‌హెచ్‌పీ కె.మౌనిక, ఏఎన్ఎంలు ఎం.మేరీ, లత పాల్గొన్నారు.

సమ్మెకు ఫ్యాప్టో మద్దతు

పిట్టలవానిపాలెం: సర్వశిక్షా అభియాన్ సిబ్బంది కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెకు మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు తమ మద్దతును తెలిపాయి. ఎంఈఓ వెంకటేశ్వరరావుకు తమ మద్దతు తెలియజేస్తూ లేఖను శనివారం సంఘాల నాయకులు అందజేశారు. సర్వశిక్షా అభియాన్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఏపీటీఎఫ్ మండల శాఖ కార్యదర్శి పరిశ నరసింహారెడ్డి, యూటీఎఫ్ మక్బుల్ ఉన్నారు.



చెంచుపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునే భక్తులు వైష్ణవ ఆలయాలకు చేరుకుని ఉత్తర ద్వారం ద్వారా స్వామివార్లను దర్శించుకున్నారు. స్వామివార్లకు అర్చకులు ప్రత్యేక అలంకరణలు చేశారు. విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మారీసుపేటలోని కోదండరామస్వామి దేవస్థానం (అప్పలస్వామి)లో విశేష అలంకరణ, ఉత్తరద్వార దర్శనం, సుదర్శన, నవగ్రహ మృత్యుంజయ హోమం నిర్వహించారు. వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారు ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో వేదమాతా గాయత్రీ అమ్మవారి ఉత్తరద్వార దర్శనం కార్యక్రమంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. గాంధీచౌక్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో విశేష పూజలు జరిపారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. - తెనాలిటౌన్



అంగలకుదురులో వేణుగోపాలస్వామివారి గ్రామోత్సవం



చెంచుపేట ఆలయంలో బారులుతీరిన భక్తులు



వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న సంకీర్తన బృందం సభ్యులు

ఇంజినీరింగ్‌కు గణితం ఆయువు పట్టు

ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేశ్వరరావు

తాడేపల్లిరూరల్: గణితం ఇంజినీరింగ్‌కు ఆయువు పట్టు అని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ బి. నాగేశ్వరరావు అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 3వ అంతర్జాతీయ గణిత సదస్సు సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు గణిత పరిశోధనలపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఇతర విభాగాల వారు కూడా గణితం యొక్క ప్రాముఖ్యతను గుర్తించి గణిత విభాగంతో కలసి సెమినార్లు నిర్వహించడం ద్వారా గణితం ఇతర విభాగాలలో ఏ విధంగా మిళితమై ఉందో విద్యార్థులకు విశదీకరించవచ్చు అని అన్నారు. ఆచార్యులు ప్రదీప్ బ్రాహ్మణ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో గణితంలో మరిన్ని పరిశోధనలు చేసి గణిత విభాగం యొక్క ఉన్నతికి తోడ్పడాలని కోరారు. మూడు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో సుమారు వంద మంది గణిత పరిశోధకులు ప్రత్యక్షంగానూ, ఆన్‌లైన్ ద్వారా తమ పరిశోధనా పత్రాలను ప్రదర్శించారు. అనంతరం గణిత విభాగంలో అత్యుత్తమ పరిశోధనలు చేసిన వారిని సత్కరించి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొవైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఎఫ్ఇడి డైరెక్టర్ డాక్టర్ ఎ. జగదీష్, గణిత విభాగాధిపతి డాక్టర్ బి.వి. అప్పారావు, ఎఫ్ఈడీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.శివగంగ ప్రసాద్ పాల్గొన్నారు.



ఉత్తమ పరిశోధనలు చేసిన వారిని సత్కరిస్తున్న ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ నాగేశ్వరరావు

ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్ దౌర్జన్యం

తెనాలిటౌన్: కొలకలూరు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిపై ఆ గ్రామ సర్పంచ్ దౌర్జన్యం చేయడంతో కేసు నమోదైంది. వివరాల మేరకు.. కొలకలూరు పంచాయతీ కార్యాలయంలో శనివారం సాయంత్రం సర్పంచ్ చొప్పర ప్రీతి, కార్యదర్శి సూరపనేని కల్పన బిల్లులు మంజూరు విషయంపై చర్చించారు. గతంలో బిల్లులు పెట్టమని సర్పంచ్ ప్రీతి కార్యదర్శి కల్పనపై ఒత్తిడి తెచ్చారు.ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. కార్యదర్శిని బయటకు వెళ్లనీయకుండా తలుపు వద్ద కుర్చీలు వేసుకుని సర్పంచ్ అడ్డంగా కూర్చుంది. దీంతో కార్యదర్శి పంచాయతీ మెంబర్లకు ఫోన్ చేసింది. కొద్దిసేపు ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం సర్పంచ్ తలుపులు తీశారు. సిబ్బంది అక్కడికి రావడంతో..సర్పంచ్ అక్కడి నుంచి వెళ్ళిపోయింది. ఎంపీటీసీ సభ్యులు ఫణికుమార్ అక్కడకు వచ్చి రూరల్ పోలీసులకు ఫోన్ చేసి, విషయం తెలియజేశారు. దీంతో ఎస్ఐ వెంకటేశ్వర్లు పంచాయతీ కార్యాలయానికి వచ్చి విచారణ చేశారు. తనను దుర్భాషలాడి, బెదిరించి నిర్బంధించినట్లు కార్యదర్శి కల్పన ఫిర్యాదు చేశారు. రికార్డులను ఎస్ఐ స్వాధీనపరచుకుని తీసుకెళ్లారు. సర్పంచ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం ఎంపీడీవో వి.ప్రతాపరెడ్డి, ఈవోపీఆర్డీ సుభాష్‌చంద్రబోస్ పంచాయతీ కార్యాలయానికి వచ్చి కార్యదర్శి కల్పనను తీసుకెళ్లారు.



పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

రోడ్డు ప్రమాదంలో నెల్లూరు యువకుడి మృతి



మృతి చెందిన వంశీకృష్ణ

చెరుకుపల్లి: ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ లారీ ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన కావూరు గురుకుల పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగింది. స్థానిక పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం ఎగువమెట్ట గ్రామానికి చెందిన మేనాటి వంశీకృష్ణ(22) అనే యువకుడు వరికోత హార్వెస్టర్ ఆపరేటర్‌గా ఇక్కడికి వచ్చాడు. శనివారం ఉదయం 12 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై కర్లపాలెం నుంచి చెరుకుపల్లి వచ్చి భోజనం చేసి, తిరిగి వెళ్తున్నాడు. కావూరు గురుకుల పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొనటంతో వంశీకృష్ణకు తలకు బలమైన గాయాలు తగిలి, అక్కడికక్కక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై ఏఎస్సై బ్రహ్మం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

భర్తే కిడ్నాప్ చేశాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదు

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. భర్త నుంచి విడిగా ఉంటున్న ఆమెను భర్తే కిడ్నాప్ చేశాడని కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల కథనం మేరకు.. నిజాంపట్నంకు చెందిన లక్ష్మీవర్షిత, డేవిడ్ ప్రేమించుకున్నారు. పెద్దలను ఎదురించి ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే వ్యక్తిగత కారణాలతో వారు విడిపోవడంతో యువతి ఆమె పుట్టింటిలో ఉంటోంది. యువతి, ఆమె కుటుంబ సభ్యులు శనివారం తెనాలి వైకుంఠపురం దేవస్థానానికి వచ్చి దర్శనం అనంతరం సినిమాకు వెళ్లారు. సినిమా ఆయ్యాక డేవిడ్ తమపై దాడి చేసి, తమ కుమార్తెను కిడ్నాప్ చేశాడని యువతి తండ్రి ఫిర్యాదు ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్రీస్తు నామంతో విజయం

గుంటూరు రూరల్: క్రీస్తు నామంలో విజయం కలుగుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. మండలంలోని వెంగళాయపాలెంలో శనివారం హోలీ స్పిరిట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలతో పాటు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడిచి ప్రేమను, శాంతిని కలుగజేయాలని సూచించారు. ఆయన్ను నమ్మిన వారికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటాడని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పాస్టర్స్‌కు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు కలిమల పురుషోత్తం, కన్వీనర్ ఇశ్రాయేలు సత్యప్రకాష్, కొలకలూరి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

నిమ్మతోటల పరిశీలన



తెనాలిటౌన్: రూరల్ మండలం సంగం జాగర్లమూడి గ్రామంలోని నిమ్మతోటలను ఉద్యాన శాఖాధికారులు శనివారం పరిశీలించారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. ఉద్యానశాఖ తెనాలి మండల విస్తరణాధికారి పులి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నిమ్మ చెట్లకు ఆశించే తెగుళ్ల, చీడపీడలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్ ప్రజ్ఞ, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



తెనాలిరూరల్: వాహనదారులు తప్పనిసరిగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని తెనాలి ప్రాంతీయ రవాణా అధికారి కె. ప్రసాద్ సూచించారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్శిటీలో విద్యార్థులకు రహదారి భద్రతపై రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో ప్రసాద్ మాట్లాడుతూ దివచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని చేరుకునేలా కృషి చేయాలని చెప్పారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. రాఘవరావు మాట్లాడుతూ రహదారి నియమాలను ఉల్లంఘిస్తే జరిమానా విధించడంతో పాటు ఒక్కోసారి వాహనాలను జప్తు చేస్తామని స్పష్టం చేశారు. రహదారులపై వాహనాలను నడిపే విడియోలను ప్రదర్శించారు. యూనివర్శిటీ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

విశ్వ బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధానత కల్పించాలి

నెహ్రూనగర్: విశ్వ బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని గుంటూరు పట్టణ సంఘ అధ్యక్షుడు కడియాల సుబ్బారావు కోరారు. అరండల్‌పేటలోని విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండలంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణులు 20లక్షల పైగా ఉన్నప్పటికీ, చట్ట సభల్లో ఎటువంటి ప్రాధాన్యత కల్పించలేదని తెలిపారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించి, వారి అభ్యున్నతికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడిపి వెంకటప్రసాద్, చిరంజీవాచారి, చిలకపాటి బ్రహ్మయ్య, శివరామకృష్ణ, గురవాచారి పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

తెనాలిఅర్బన్: జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి సెమిక్రిస్మస్ వేడుకలను స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, ఆయన సతీమణి డాక్టర్ మనోహరం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పాస్టర్‌లు బిషప్ ప్రభుదాసు, బాబురావు, గాబ్రెల్, డి.శ్యామేల్, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన పైథాన్ ప్రోగ్రామింగ్ వర్క్ షాప్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులకు పైథాన్ ప్రోగ్రామింగ్‌పై ఆరు రోజుల పాటునిర్వహిస్తున్న వర్క్‌షాప్ శనివారం ముగిసింది. కళాశాల చైర్మన్ చందు రామారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కళాశాల సంయుక్తంగా నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో శిక్షకులు వనిత పైథాన్‌లో వస్తున్న మార్పులు, ప్రోగ్రామ్ సులువుగా ఎలా రాయాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి చందు విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ తాడివాక రాఘవేంద్ర విష్ణు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' క్రీడల్లో పాల్గొనండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొనాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర 2కె రన్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. ఇప్పటికే పట్టణంలోని 47 సచివాలయాల పరిధిలో క్రీడాకారులు, వారు పాల్గొనే పోటీల వివరాలను నమోదు చేయడం జరిగిందన్నారు. సచివాలయ ఉద్యోగులు తెలియజేసిన సమయంలో క్రీడాకారులు పోటీల్లో పాల్గొని, విజయం సాధించాలని కోరారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి కింద రూ.5లక్షలు, రెండో బహుమతి కింద రూ.3లక్షలు, మూడో బహుమతి కింద రూ.2లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు, స్పెషల్ ఆఫీసర్ గాయత్రీదేవి, మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, పలు పాఠశాలల పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఆడుదాం ఆంధ్ర పోటీలలో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం ఆడుదాం ఆంధ్రా పోటీలకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. పోటీలు జరిగే ప్రాంతాన్ని ఉద్యోగులు సందర్శించి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రత్యేక అధికారి గాయత్రీదేవి మాట్లాడుతూ సచివాలయ అడ్మిన్‌లు క్రీడ ప్రాంగాణంలో వసతులు ఏర్పాటు చేయడంతో పాటు క్రీడాకారులు పాల్గొనే విధంగా చూడాలన్నారు. అందరూ సమష్టిగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు, మేనేజర్ అప్పలరాజు, నోడల్ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● తెనాలి పట్టణంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఈ నెల 26నుంచి జనవరి 30 వరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. తెనాలి పట్టణంలో క్రికెట్, కబడ్డీ, ఖో-ఖో, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు.



2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



ఇందిరానగర్ కాలనీలో సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ, రామ్‌చంద్

తెనాలిఅర్బన్: సెమీ క్రిస్మస్ వేడుకలను తెనాలి పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌లను అతిథులు కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. చినరావూరులోని సెయింట్ జోసఫ్ అప్పర్ ప్రేమరీ స్కూల్ సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ, ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.రామ్‌చంద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వేమూరి బీలీబీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చెంచుపేట ఇందిరానగర్ కాలనీలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఇమ్మానియేల్ ప్రార్థన గోపురం నిర్వాహకులు రెవరెండ్ ఎ.భానుప్రసాద్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

పేదలకు దుస్తులు పంపిణీ

తెనాలిఅర్బన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొమ్ము రాయల్ ఆధ్వర్యంలో ఐతానగర్‌లో శనివారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేయడం సంతోషానిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బూరెల దుర్గ, కఠారి హరీష్, అత్తోట చంటి, మేకల సురేష్, దుబాయ్‌బాబు, అక్కిదాసు కిరణ్, అత్తోట అమృతరాజు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఖలేదా నసీమ్, చైర్‌పర్సన్ రాధిక

6 నుంచి హనుమధీశ్వర మహాయజ్ఞం

తెనాలి: జనవరిలో వారం రోజుల పాటు శ్రీ చండీ సహిత హనుమధీశ్వర మహాయజ్ఞం నిర్వహించనున్నారు. బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో ప్రత్యేకంగా జరిగే ఈ మహా యజ్ఞానికి చెందిన భారీ పోస్టరును శనివారం రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ ఆవిష్కరించారు. వాల్ పోస్టర్లను శశి ఫుడ్స్ అధినేత వుప్పల వరదరాజులు, ఆర్యవైశ్య సంఘాల కో-ఆర్డినేటర మద్దాళి శేషాచలం, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. జనవరి 6-12వ తేదీల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్-పుష్ప దంపతుల ద్వారా మహాయజ్ఞం జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజూ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, అభిషేకాలు, విశేష అర్చనలు, హోమాలు రేలంగి ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి తొలి సినీ నేపథ్య గాయకుడు స్వర్గీయ ఎంఎస్ రామారావు మనుమడు డాక్టర్ పి.శ్రీనివాస్ సుందరకాండ పారాయణ ఉంటుందని వివరించారు. 5న సాయంత్రం పట్టణంలోని రామాలయం నుంచి శోభాయాత్ర ఉంటుందని వుప్పల వరదరాజులు వెల్లడించారు. భక్తులు పాల్గొనాలని కోరారు. పోస్టరు ఆవిష్కరణలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, గొడవర్తి సాయిహరేరామ్, కొల్లా గురునాథగుప్తా, చందూరుసాయి, భాస్కరుని లక్ష్మీనారాయణ, బ్రాహ్మణ పరిషత్ ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ, పెద్దిరాజు సత్యనారాయణ, పుచ్చా విజయకుమార్, నూకల వెంకట భాస్కర్ పాల్గొన్నారు.



పోస్టరును ఆవిష్కరించిన దేవదాయశాఖ సలహాదారు శ్రీకాంత్

న్యాయ విజ్ఞాన సదస్సులతో చట్టాలపై అవగాహన

భట్టిప్రోలు: న్యాయ విజ్ఞాన సదస్సులో గ్రామాల్లో నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రజలకు చట్టాలపై అవగాహన వస్తుందని పీడీఎం కోర్టు జడ్జి జగదీష్ అన్నారు. భట్టిప్రోలు దళితవాడలో శనివారం రాత్రి జాతీయ న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉచిత న్యాయ సహాయం, గృహ హింస చట్టం, న్యాయ సేవా సంస్థ అందించే సేవలతో పాటు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే వాహన చట్టంలోని పలు అంశాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏజేసీజే కోర్టు జడ్జి రూపశ్రీ, ఎస్ఐ అంబటి చంద్రశేఖర్, న్యాయవాదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పీడీఎం కోర్టు జడ్జి జగదీష్